10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 6/14/2026 5:04 AM Page 1

మన రాజధాని
# రక్షణ
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు
ఆదివారం 14 జూన్ 2026 పేజీలు : 4


వివరాలు 2లో..

# యోగతోనే సంపూర్ణ ఆరోగ్యం

### కలెక్టర్ సాయికాంత్ వర్మ

### నిత్య యోగా సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యం

**ప్రజలు యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకుంటే అనారోగ్య సమస్యలు దరిచేరకుండా సంపూర్ణ ఆరోగ్యంతో జీవిం చవచ్చని గుంటూరు జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ అన్నారు. మంగళగిరిలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా కార్యక్రమంలో ఆయన పాల్గొని యోగా ప్రాధాన్యతను వివరించారు.**

గుంటూరు రక్షణ న్యూస్

# గోపిరెడ్డికి చదలవాడ సవాల్


వివరాలు 2లో..

నరసరావుపేట రక్షణ న్యూస్

### ఐదేళ్లలో చేయలేని అభివృద్ధిని రెండేళ్లలో చేశాం..

### కూటమి విజయోత్సవ సభకు భారీ ఏర్పాట్లు

గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చే య లేని అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వం రెండేళ్లలో పూర్తి చేసి చూపిం చిందని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. కూటమి పాలన చూసి మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సిగ్గుతో తలవంచుకోవాలని విమర్శించారు.

# పోలీస్ సంక్షేమంపై ఎస్పీ స్పష్టమైన హామీ

పోలీస్ సిబ్బంది

సంక్షేమమే లక్ష్యం

సిబ్బంది సమస్యలపై ప్రత్యక్ష వినతి..

సిబ్బంది శ్రేయస్సుపై ప్రత్యేక దృష్టి


వివరాలు 2లో..

**పోలీస్ సిబ్బంది సంక్షేమమే శాఖ అభివృద్ధికి పునాదని బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమా మహేశ్వర్ ఐపీఎస్ స్ప ష్టం చేశారు. ప్రతి నెల నిర్వహిస్తున్న పోలీస్ సహచార్ ఓపెన్ హౌస్ కార్యక్రమంలో సిబ్బంది సమస్యలను స్వయంగా స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.**

బాపట్ల రక్షణ న్యూస్

# సేవకు సలాం సారూ

### రక్తదాన రథసారథిగా రిటైర్డ్ ఏఎస్ఐ...

### 52 సార్లు రక్తదానం చేసిన ఏఎస్ఐ మోహనరావు..

### రక్తదాతలకు స్ఫూర్తిగా నిలిచిన ఖాకీ


వివరాలు 2లో..

**విధి నిర్వహణలో ప్రజల భద్రత కోసం సేవలందించిన ఓ రిటైర్డ్ ఏఎస్ఐ, రక్తదానంతోనూ ప్రాణాలను కాపాడుతూ ఆదర్శంగా నిలిచారు. 52 సార్లు రక్తదానం చేసి మానవత్వానికి అర్థం పట్టిన కొలుసు మోహన్రావు , ప్రపంచ రక్తదాతల దినోత్సవం వేళ అందరికీ స్ఫూర్తిగా మోహన్ రావు నిలిచారు.**

మంగళగిరి రక్షణ న్యూస్

# ఆరోగ్య జీవనానికి యోగాయే మార్గం

### మానసిక ప్రశాంతతకు యోగ సాధన కీలకం..

పర్చూరు రక్షణ న్యూస్

ప్రజలు మానసిక ఒత్తిడి నుంచి విముక్తి పొంది ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలంటే యోగా ఉత్తమ మార్గమని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి. అన్నారు. పర్చూరు మండలం అద్దంకి నాంచారమ్మ దేవస్థానం ఆవరణలో శనివారం నిర్వహించిన 'యోగాంధ్ర' కార్యక్రమంలో


మిగతా 2లో

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 6/14/2026 5:04 AM Page 2



# పోలీస్ సంక్షేమంపై ఎస్పీ స్పష్టమైన హామీ

మొదటి పేజీ తరువాయి

**బాపట్ల రక్షణ న్యూస్**

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ తెలిపారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించిన 'పోలీస్ సహచార్ ఓపెన్ హౌస్' కార్యక్రమంలో ఆయన పాల్గొని సిబ్బంది నుంచి నేరుగా వినతులు స్వీకరించారు.ప్రతి నెల రెండవ శనివారం నిర్వహించే ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లు, విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు, పోలీస్ సిబ్బంది పాల్గొని తమ వ్యక్తిగత, ఆరోగ్య, కుటుంబ సంబంధిత సమస్యలు, బదిలీలు, ఇతర శాఖాపరమైన అంశాలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు.విన్నపాలను కూలంకషంగా పరిశీలించిన ఎస్పీ ఉమామహేశ్వర్, పరిష్కారం సాధ్యమైన అంశాలపై వెంటనే చర్యలు తీసుకోవడంతో పాటు, ఇతర సమస్యల పరిష్కారానికి సీసీఎస్ డీఎస్పీ పి. జగదీష్ నాయక్, డీపీవో అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సిబ్బంది సమస్యలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ సహచార్ కార్యక్రమం సిబ్బంది తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి నేరుగా తీసుకెళ్లేందుకు సమర్థ వేదికగా నిలుస్తోందని ఎస్పీ పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే 'ఎస్పీ సంపర్క్' కార్యక్రమం ద్వారా కూడా సిబ్బంది నేరుగా ఫోన్ చేసి తమ సమస్యలను తెలియజేయవచ్చని తెలిపారు.సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించిన ఎస్పీ, విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండటంతో పాటు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు.పోలీస్ సంక్షేమం, సమస్యల పరిష్కారం, సిబ్బంది మనోబల పెంపు లక్ష్యంగా ఇటువంటి మరింత సమర్థవంతంగా కొనసాగిస్తామని ఎస్పీ వెల్లడించారు.

## ఆరోగ్య జీవనానికి యోగాయే మార్గం

ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా యోగాసనాలు వేస్తూ ప్రజలకు స్ఫూర్తిగా నిలిచారు. పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు, అధికారులు యోగాసనాల్లో పాల్గొన్నారు. త్రికోణాసనం, భద్రాసనం, వజ్రాసనం, శశాంకాసనం, భుజంగాసనం, పద్మాసనం, ప్రాణాయామం, నాడీ శోధన, శీతలి ప్రాణాయామం, భ్రమరి ప్రాణాయామం తదితర యోగాసనాలు నిర్వహించి యోగ సంకల్ప ప్రతిజ్ఞ చేశారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. భారతీయ సంస్కృతిలో యోగాకు విశిష్ట స్థానం ఉందని, యోగా సర్వరోగ నివారిణిగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. ప్రతిరోజూ యోగ సాధన చేయడం ద్వారా ఆరోగ్యం, ఆలోచనల్లో స్పష్టత, మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని వివరించారు. తాను కూడా ప్రతిరోజూ ధ్యానం, యోగ సాధన చేయడం వల్ల ఆరోగ్యంగా ఉన్నానని తెలిపారు.బాపట్ల జిల్లా పర్యాటక రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. పర్యాటక రంగ అభివృద్ధితో ఉపాధి అవకాశాలు, వ్యాపారాలు, హోటళ్లు, రెస్టారెంట్లు పెరిగి జిల్లా ప్రజల ఆదాయం మరింత మెరుగుపడుతుందని తెలిపారు.యోగాతో ఏకాగ్రత, పట్టుదల, లక్ష్యసాధన సామర్థ్యం పెరుగుతుందని బాపట్ల ఆర్డీఓ ఏ. హరికుమార్ అన్నారు. భారత సనాతన ధర్మంలో యోగ ఒక ముఖ్యమైన భాగమని పర్చూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి, ఉప కలెక్టర్ లవన్న పేర్కొన్నారు. ప్రతిరోజూ కనీసం 45 నిమిషాల పాటు యోగాసనాలు చేస్తే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ సూచించారు.యోగాంధ్ర జిల్లా నోడల్ అధికారి డాక్టర్ డి. చంద్రశేఖర్, తహసీల్దార్ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు

# యోగతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు రక్షణ న్యూస్**

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 15 రోజుల యోగ ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం మంగళగిరిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ప్రాంగణంలో జిల్లా స్థాయి యోగా కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ యోగ శాస్త్ర పితామహుడు మహర్షి పతంజలి చిత్రపటానికి పూలమాల వేసి, యోగ గురువులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన అలవాట్ల ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప ఆధ్యాత్మిక, ఆరోగ్య సాధన యోగ అని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా యోగాకు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో గుంటూరు జిల్లా ప్రజలు కూడా యోగాను తమ దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు.యోగ సాధన వల్ల అనారోగ్య సమస్యలు దూరమవడంతో పాటు శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఆర్థిక భారం తగ్గే అవకాశం ఉంటుందని చెప్పారు. యోగా కేవలం కొన్ని ఆసనాలకు మాత్రమే పరిమితం కాకుండా జీవనశైలిలో భాగం కావాలన్నారు. ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా ఒత్తిడి తగ్గి ఉత్సాహభరితమైన, క్రమశిక్షణతో కూడిన జీవనం అలవడుతుందని తెలిపారు.ప్రస్తుతం అనేక మందిని వేధిస్తున్న మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణకు ప్రాణాయామం వంటి యోగా సాధనలు ఎంతో మేలు చేస్తాయని కలెక్టర్ వివరించారు. యోగాను మన పూర్వీకులు అందించిన అమూల్యమైన సాంస్కృతిక వారసత్వంగా అభివర్ణించారు.కార్యక్రమంలో యోగా గురువు విజయగౌరి సూర్య మంత్రాలతో సూర్య నమస్కారాలను ప్రదర్శించడంతో పాటు సమతుల్య ఆహారం, ఆరోగ్యకర జీవన విధానంపై అవగాహన కల్పించారు. ఆయుష్మాన్ శాఖ అధికారి జి. విజయానంద్ ఆధ్వర్యంలో పాల్గొన్న వారందరూ వివిధ యోగాసనాలు చేశారు.కార్యక్రమం అనంతరం యోగా గురువు విజయగౌరి, ఆయుష్మాన్ శాఖ అధికారి జి. రామానంద్‌లను జిల్లా కలెక్టర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. విజయలక్ష్మి, జిల్లా పర్యాటక అధికారి రమ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, యోగా సాధకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# గోపిరెడ్డికి చదలవాడ సవాల్

మొదటి పేజీ తరువాయి

**నరసరావుపేట రక్షణ న్యూస్**

నరసరావుపేటలో ఈనెల 15న నిర్వహించనున్న ఉమ్మడి కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన విజయోత్సవ సభకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఏర్పాట్లను నరసరావుపేట ఎమ్మెల్యే చదలవడా అరవింద బాబు పరిశీలించారు. సభా వేదిక, ప్రజల కోసం ఏర్పాటు చేస్తున్న సదుపాయాలు, భద్రతా చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, గత వైసీపీ ప్రభుత్వ పాలనపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి కంటే అరాచకాలు, అవినీతి, విధ్వంసకర పాలన ఎక్కువగా కనిపించాయని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైన ఆ ప్రభుత్వం రాష్ట్రాన్ని వెనక్కి నెట్టిందన్నారు.అదే సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ప్రజలకు కనిపించేలా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసిందని పేర్కొన్నారు. రహదారులు, మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలు, పెట్టుబడుల ఆకర్షణ వంటి రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించామని చెప్పారు. గతంలో చేయలేని పనులను ఇప్పుడు పూర్తి చేస్తున్నందున ప్రతిపక్ష నేతలు అసహనానికి గురవుతున్నారని వ్యాఖ్యానించారు.మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి కూటమి ప్రభుత్వ పనితీరును చూసి విమర్శలు చేయడం మానుకుని వాస్తవాలను అంగీకరించాలని సవాల్ విసిరారు. వైసీపీ ఐదేళ్ల పాలనతో పోలిస్తే కూటమి రెండేళ్ల పాలన ఎంతో మెరుగ్గా ఉందని ప్రజలే చెబుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో గోపిరెడ్డి సిగ్గుతో తలవంచుకోవాలని ఎద్దేవా చేశారు.మాజీ ముఖ్యమంత్రి వై . స్ . జగన్ మోహన్ రెడ్డి , గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కూటమి ప్రభుత్వం సాధిస్తున్న విజయాలను చూసి ఈర్ష్యపడుతున్నారని కూడా ఆయన ఆరోపించారు. ప్రజల మద్దతు కూటమికే ఉందని, రాబోయే ఎన్నికల్లో కూడా అదే పరిస్థితి కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు.2029 ఎన్నికల్లో నరసరావుపేట నియోజకవర్గంలో మళ్లీ తానే ఎమ్మెల్యేగా విజయం సాధిస్తానని, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు మరోసారి ముఖ్యమంత్రి అవుతారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలే తమకు అతిపెద్ద బలమని పేర్కొన్నారు.కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు షేక్ జాన్ సైదా, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశు కుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు. విజయోత్సవ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులకు నాయకులు పిలుపునిచ్చారు.జూన్ 15న జరగనున్న ఈ సభకు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. సభను విజయవంతం చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి స్థాయిలో కొనసాగుతున్నాయి.

## సేవకు సలాం సారూ

**మంగళగిరి రక్షణ న్యూస్**

ఖాకీ దుస్తుల్లో ప్రజల రక్షణ కోసం సేవలందించిన ఓ పోలీసు అధికారి, పదవీ విరమణ అనంతరం కూడా మానవత్వ సేవలో ముందుంటూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. మంగళగిరి ఎల్‌బీనగర్‌కు చెందిన రిటైర్డ్ ఏఎస్ఐ కొలుసు మోహనరావు 52 సార్లు రక్తదానం చేసి అనేక మంది ప్రాణాలను కాపాడిన అరుదైన రక్తదాతగా గుర్తింపు పొందారు.1978లో కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో చేరిన మోహనరావు, విధి నిర్వహణతో పాటు 1989 నుంచి రక్తదానం ప్రారంభించారు. ఏడాదికి రెండు సార్లు, అత్యవసర పరిస్థితుల్లో మూడు సార్లు కూడా రక్తదానం చేస్తూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న అనేక మందికి జీవదానంగా నిలిచారు.2017లో మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పదవీ విరమణ చేసిన తర్వాత కూడా ఆయన సేవా ప్రస్థానం ఆగలేదు. 2021 ఫిబ్రవరిలో మణిపాల్ ఆస్పత్రిలో చేసిన రక్తదానంతో ఆయన 52వ సారి రక్తదానం పూర్తి చేశారు. వయసు పెరుగుతున్న నేపథ్యంలో వైద్యులు విశ్రాంతి తీసుకోవాలని సూచించడంతో కొంతకాలంగా రక్తదానానికి విరామం ఇచ్చారు.అయితే వైద్యుల అనుమతి లభిస్తే మళ్లీ రక్తదానం చేసేందుకు సిద్ధమేనని మోహనరావు చెబుతున్నారు. "నా రక్తం వల్ల ఒకరి ప్రాణం నిలబడితే అంతకంటే గొప్ప సంతృప్తి లేదు" అనే ఆయన మాటలు సేవా భావానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా మోహనరావు సేవలను పలువురు ప్రశంసిస్తున్నారు. పోలీసు శాఖలో సేవలందించిన ఆయన, రక్తదానం ద్వారా కూడా సమాజానికి సేవ చేయవచ్చని నిరూపిస్తూ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 6/14/2026 5:04 AM Page 3



# వరదతో వాహనాల స్తంభనం

సత్తెనపల్లి రక్షణ న్యూస్




సత్తెనపల్లి పట్టణంలో శనివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. సత్తెనపల్లి--నరసరావుపేట ప్రధాన రహదారిపై సాయి కృష్ణ హాస్పిటల్ సమీపంలోని చిన్న వంతెన వద్ద భారీగా వరద నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా వెంకటపతి కాలనీ సమీపంలో వరద ప్రవాహం ఉధృతంగా ఉండటంతో పలు వాహనాలు నీటిలో చిక్కుకుపోయాయి.వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనగా, సమాచారం అందుకున్న సత్తెనపల్లి మున్సిపాలిటీ అధికారులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్రేన్ సహాయంతో వరద ప్రవాహంలో చిక్కుకున్న వాహనాలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. అనంతరం నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న చెత్తాచెదారం, మట్టిని తొలగించి వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు.భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వర్షపు నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అనవసరంగా ప్రయాణాలు చేయవద్దని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని హెచ్చరించారు. మున్సిపల్ సిబ్బంది పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.


# నగరవ్యాప్తంగా దోమల నివారణ కు ఫాగింగ్

గుంటూరు రక్షణ న్యూస్



గుంటూరు, జూన్ 13: నగర ప్రజల ఆరోగ్య రక్షణకు సీజనల్ వ్యాధుల నియంత్రణే ప్రధాన లక్ష్యంగా నగరపాలక సంస్థ మలేరియా విభాగం ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో ఫాగింగ్, యాంటీ మలేరియా చర్యలు చేపడుతున్నట్లు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. వర్షాకాలం, మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.నగరంలోని అన్ని వార్డుల్లో పిన్‌పాయింట్ ప్రోగ్రాం ద్వారా ప్రణాళికాబద్ధంగా ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం 28 హ్యాండ్ ఫాగింగ్ యంత్రాలు, 3 వెహికిల్ మౌంటెడ్ ఫాగింగ్ యంత్రాలు, 60 స్ప్రే యంత్రాల సహాయంతో నగరవ్యాప్తంగా షెడ్యూల్ ప్రకారం ఫాగింగ్, కెమికల్ స్ప్రేయింగ్ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇరుకైన వీధుల నుంచి ప్రధాన రహదారులు, కల్వర్టుల వరకు దోమల నివారణ చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.అదేవిధంగా చెరువులు, నీటి కుంటల్లో డ్రోన్ల ద్వారా స్ప్రేయింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 180 మంది మలేరియా సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేస్తూ దోమల ఉత్పత్తి కేంద్రాలను గుర్తించి నివారణ చర్యలు చేపడుతున్నారని చెప్పారు. నిల్వ నీటి ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయడంతో పాటు గంబూషియా చేపలను వదిలి దోమల లార్వాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.ఈ సీజన్‌లో సుమారు 30 లక్షల గంబూషియా చేపలను నీటి నిల్వ ప్రాంతాల్లో విడిచిపెట్టి దోమల ఉత్పత్తిని ప్రాథమిక దశలోనే అరికట్టే ప్రయత్నం చేస్తున్నామని కమిషనర్ తెలిపారు. నగరపాలక సంస్థ చేపడుతున్న చర్యలకు ప్రజలు సహకరించి తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం: కన్నా



సత్తెనపల్లి రక్షణ న్యూస్...

సత్తెనపల్లి పట్టణంలోని రఘురామ్ నగర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను ఎమ్మెల్యేకు అందజేశారు.ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించిన కన్నా లక్ష్మీనారాయణ వారి సమస్యలను ఓపికగా విని, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గృహాలు, పెన్షన్లు, వైద్య సేవలు, మౌలిక వసతులు తదితర అంశాలకు సంబంధించిన పలు సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుని తక్షణ పరిష్కారం చూపడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి వినతిని పరిశీలించి అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తూ, ప్రతి సమస్య పరిష్కారానికి కట్టుబడి ఉంటామని కన్నా లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు.

# అక్రమ గ్యాస్ నిల్వల పై అధికారులు కేసు నమోదు

మార్కాపురం రక్షణ న్యూస్



పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో ఎన్ఫోర్స్మెంట్ అధికారులు శుక్రవారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాణిజ్య అవసరాలకు అక్రమంగా వినియోగిస్తూ నిల్వ ఉంచిన 14 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ నిల్వలకు పాల్పడిన వారిపై 6ఏ కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. గృహావసరాలకు కేటాయించిన గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించడం చట్టవిరుద్ధమని, ఇటువంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తదుపరి రోజుల్లో కూడా తనిఖీలు కొనసాగనున్నట్లు వెల్లడించారు.

# రక్తదానమే మహాదానం

వినుకొండ రక్షణ న్యూస్



ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని పల్నాడు జిల్లా వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో శనివారం ప్రత్యేక రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. రక్త గ్రూపులను కనుగొన్న ప్రముఖ శాస్త్రవేత్త కార్ల్ ల్యాండ్‌స్టెయినర్ జన్మదినాన్ని ప్రతి ఏడాది జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది జూన్ 14 ఆదివారం కావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారమే రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ దయానిధి మాట్లాడుతూ, రక్తదానం ద్వారా ప్రమాదాలు, అత్యవసర వైద్య పరిస్థితుల్లో ఉన్న అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ప్రతి ఆరోగ్యవంతుడు నిర్దిష్ట వ్యవధిలో రక్తదానం చేయడం సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. యువత, ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటాలని పిలుపునిచ్చారు.శిబిరంలో ప్రభుత్వ వైద్యశాల వైద్యులు, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, స్వచ్ఛంద రక్తదాతలు పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

# స్మశానానికి మౌలిక వసతులు

కర్లపాలెం రక్షణ న్యూస్



కర్లపాలెం మండలం గణపవరం పంచాయతీ పరిధిలోని ఉర్లమ్మ కాలనీ వాసులు వినియోగిస్తున్న శ్మశాన వాటికను కూటమి నాయకులు శనివారం పరిశీలించారు. శ్మశాన వాటిక పరిసరాలను శుభ్రం చేయించి, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా రహదారి నిర్మాణం, ఫెన్సింగ్ ఏర్పాటు వంటి అభివృద్ధి పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ బాజీ, జనసేన మండల అధ్యక్షుడు గొట్టిపాటి శ్రీకృష్ణ మాట్లాడుతూ, గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. శ్మశాన వాటికకు సరైన రహదారి, భద్రత కోసం ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయని పేర్కొన్నారు.అనంతరం శ్మశాన వాటిక ప్రాంతాన్ని పరిశీలించి అవసరమైన అభివృద్ధి పనులపై స్థానికులతో చర్చించారు. కార్యక్రమంలో నాయకులు నిజాంపట్నం యానాది, కొండలు తదితరులు పాల్గొన్నారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 6/14/2026 5:04 AM Page 4



# పొగాకు రైతులను ఆదుకోండి

**పొదిలి రక్షణ న్యూస్**



పొగాకు రైతులను తక్షణమే ఆదుకోవాలని, వారి సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో రూ.500 కోట్లు ప్రత్యేక నిధులు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అసంఘటిత కార్మికుల, ఉద్యోగుల విభాగం చైర్మన్ తథా దర్శి నియోజకవర్గ ఇంచార్జ్ కైపు వెంకటకృష్ణా రెడ్డి డిమాండ్ చేశారు.పొదిలి పొగాకు క్లస్టర్ పరిధిలోని దర్శి, దొనకొండ, కురిచేడు మండలాల పొగాకు రైతులతో ఆయన పొదిలి పొగాకు బోర్డు కార్యాలయం వద్ద సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం పొగాకు బోర్డు సూపర్వైజర్తో చర్చించి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వేలం విధానం, ధరల పరిస్థితిపై ఆరా తీశారు.ఈ సందర్భంగా కైపు వెంకటకృష్ణా రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం పొగాకు వేలంలో కేజీ ధర గరిష్టంగా రూ.248, కనిష్టంగా రూ.212 మాత్రమే పలకడం రైతులకు తీవ్ర నిరాశ కలిగిస్తోందన్నారు. సాగు వ్యయాలు విపరీతంగా పెరిగిన పరిస్థితుల్లో ఈ ధరలు ఏమాత్రం గిట్టుబాటు కావని పేర్కొన్నారు. దీంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పొగాకు రైతుల పరిస్థితి రోజురోజుకు దయనీయంగా మారుతోందని, వారి కష్టాలను గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించాలని కోరారు. రైతులకు ప్రత్యేక సహాయక ప్యాకేజీ ప్రకటించడంతో పాటు గిట్టుబాటు ధరలు కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.పొగాకు రైతుల సమస్యలను ప్రభుత్వాలు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ తరఫున నిరంతరం పోరాటం చేస్తామని కైపు వెంకటకృష్ణా రెడ్డి స్పష్టం చేశారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.ఈ సమావేశంలో పెద్ద సంఖ్యలో పొగాకు రైతులు పాల్గొని తమ సమస్యలను వివరించారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని నాయకులు పేర్కొన్నారు.

## మిర్చియార్డులో ఆకస్మిక తనిఖీలు...

**బాల కార్మికుల గుర్తింపు**



**రక్షణ న్యూస్ గుంటూరు**

గుంటూరు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గుంటూరు మిర్చియార్డు పరి ధిలో అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భ ంగా యార్డులో పని చేస్తున్న ఇద్దరు బాల కార్మికులను అధికారులు గుర్తిం చి అదుపులోకి తీసుకున్నారు .బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం కట్టుబడి ఉన్న నేపథ్యంలో మిర్చియార్డులో విస్తృత స్థాయిలో తనిఖీలు చేపట్టినట్లు అధి కారులు తెలిపారు. తనిఖీల సమయంలో బాలలను పనుల్లో నిమ గ్నం చేసినట్లు గుర్తించడంతో సంబంధిత వారిపై చర్యలకు అధికారులు సిద్ధమయ్యారు.బాల కార్మికులను రక్షించి, వారి వివ రాలను సేకరిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఘటనపై విచా రణ కొనసాగుతోందని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకు ంటామని తెలిపారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## ఎంపీతో ఆర్డీవో భేటీ



**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఏ. హరికుమార్ శనివారం బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీకి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.భేటీ సందర్భంగా బాపట్ల రెవెన్యూ డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు మెరుగైన సేవల అందజేత, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలుపై చర్చించినట్లు సమాచారం. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ సూచించారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించేందుకు కృషి చేస్తానని ఆర్డీవో ఏ. హరికుమార్ తెలిపారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు.ఈ మర్యాదపూర్వక భేటీలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యానికి భరోసా

**వెదుళ్లపల్లి రక్షణ న్యూస్**



వెదుళ్లపల్లి గ్రామంలో శ్రీ గోపరాజు రామచంద్రరావు--రుక్మిణమ్మ చారిటబుల్ ట్రస్ట్, ఉచిత వైద్యశాల మరియు ఉచిత కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఉచిత కంటి, చెవి వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరంలో విద్యార్థులకు కంటి, చెవి సంబంధిత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లను ఉచితంగా పంపిణీ చేశారు.శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ బి. వినోద్ కుమార్ విద్యార్థులకు చెవి పరీక్షలు నిర్వహించి, చెవి ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. చెవులకు సంబంధించిన సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే డాక్టర్ అమృతపాణి పర్యవేక్షణలో ఆప్తోమెట్రిస్ట్ ఎం. సుభాషిని కంటి పరీక్షలు నిర్వహించి, చూపు సమస్యలు ఉన్న విద్యార్థులకు ఉచితంగా కళ్లజోళ్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రవాస భారతీయ వైద్యులు డాక్టర్ మహదేవన్ మూర్తి నేమాని (ఎంఎస్, యుఎస్ఏ), డాక్టర్ మాధవి గోపరాజు (ఎండీ, యుఎస్ఏ), ఇషా నెమాని, దివ్య వడ్లకొండలు పాల్గొని సేవలు అందించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.అంతేకాకుండా, అర్హులైన లబ్ధిదారులకు ఉచితంగా కళ్లజోళ్లు, వినికిడి యంత్రాలు అందజేసేందుకు సంస్థ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

# వైసీపీ నిరసనలతో గురజాలలో ఉద్రిక్తత

**గురజాల రక్షణ న్యూస్**



పల్నాడు జిల్లా గురజాల పట్టణంలో శనివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిర్వహించిన ర్యాలీ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 'వెన్నుపోటు దినం' పేరుతో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి అనుచరులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సహా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ర్యాలీ సందర్భంగా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు ద్విచక్ర వాహనాలతో పట్టణ వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. దీంతో ప్రధాన రహదారులపై కొంతసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొనడంతో పట్టణంలో రాజకీయ సందడి నెలకొంది.అయితే, ర్యాలీ సందర్భంగా కొన్ని వాహనాలు అధిక శబ్దాలతో సంచరించడంతో స్థానికులు అసౌకర్యానికి గురైనట్లు సమాచారం. మహిళలు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని స్థానికులు పేర్కొన్నట్లు తెలుస్తోంది. శాంతియుతంగా ర్యాలీ నిర్వహించాలని పోలీసులు సూచించినప్పటికీ, కొన్ని చోట్ల కార్యకర్తల అత్యుత్సాహం కనిపించిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతుండగా, వైసీపీ నాయకులు మాత్రం తమ కార్యక్రమం పార్టీ శ్రేణుల ఐక్యతను చాటేందుకేనని పేర్కొన్నారు. ర్యాలీ అనంతరం కార్యకర్తలు శాంతియుతంగా చెదరిపోయారు.

# పేదల ఆరోగ్యానికి సాంబన్న ఆర్థిక చేయూత

**పర్చూరు రక్షణ న్యూస్**

పేద ప్రజల కష్టసుఖాల్లో అండగా నిలుస్తూ, వారి వైద్య అవసరాల కోసం నిరంతరం కృషి చేస్తున్న పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు (సాంబన్న) మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో చికిత్స చేయించుకోలేని ఓ చిన్నారి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ.3,07,205 మంజూరు అయ్యేలా చొరవ తీసుకుని కుటుంబానికి ఊరట కల్పించారు.ఇంకొల్లు మండలం ఇడుపులపాడు గ్రామానికి చెందిన ముత్తూరి పెద్ద ఇశ్రాయేలు కుటుంబం తమ చిన్నారి చికిత్స కోసం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం ఎమ్మెల్యే దృష్టికి రావడంతో వెంటనే స్పందించారు. తన కార్యాలయ ప్రతినిధుల ద్వారా ముఖ్యమంత్రి కార్యాలయంతో సమన్వయం చేసి వైద్య సహాయం అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు.ఎమ్మెల్యే ఏలూరి సిఫారసు మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చిలకలూరిపేటలోని వరలక్ష్మి ఫెర్టిలిటీ అండ్ మేటర్నిటీ ఆస్పత్రికి రూ.3.07 లక్షల వరకు వైద్య ఖర్చులు భరించేందుకు ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరైంది. ఈ సందర్భంగా సీఎంఆర్ఎఫ్ సహాయానికి సంబంధించిన పత్రాలను స్థానిక నాయకులు లబ్ధిదారుల కుటుంబానికి అందజేశారు.ప్రజల



ఆరోగ్య రక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక అండ అందుతోందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని హామీ ఇచ్చారు.పేద ప్రజల వైద్య అవసరాల కోసం ఎమ్మెల్యే ఏలూరి చూపుతున్న చొరవపై స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇప్పటికే వందలాది మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా కోట్ల రూపాయల సహాయం అందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని, తాజాగా మరో చిన్నారి ఆరోగ్యానికి అండగా నిలవడం అభినందనీయమని ప్రజలు పేర్కొన్నారు.

# ఎన్నికలే లక్ష్యంగా కార్యకర్తలకు దిశా నిర్దేశం



**వేమూరు రక్షణ న్యూస్**

రాబోయే ఎన్నికల్లో విజయం సాధించాలంటే ఖచ్చితమైన ఓటరు జాబితా అత్యంత కీలకమని వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. వేమూరు గ్రామంలోని ఓ ప్రైవేట్ కళ్యాణ మండపంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) శిక్షణ, అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని నాయకులు, బీఎల్ఏలు, బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చూడటంతో పాటు అనర్హుల పేర్ల తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమంపై సమగ్ర అవగాహన కల్పిస్తూ జూన్ 15 నుంచి జూలై 14 వరకు బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయనున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాల సవరణ, చిరునామా మార్పులు, పేర్లలో తప్పుల సరిదిద్దడం వంటి అంశాలపై కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ప్రతి బూత్‌లో 18 సంవత్సరాలు నిండిన యువతను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయాలని, వివాహం అనంతరం గ్రామానికి వచ్చిన మహిళల పేర్లను పరిశీలించాలని సూచించారు.ప్రతి బీఎల్ఏ రోజువారీ ఇంటింటి సర్వే నిర్వహించి కొత్త ఓటర్లు, మరణించిన వారు, వలస వెళ్లిన వారి వివరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. కూటమి నాయకులతో సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.అనంతరం కార్యకర్తల సందేహాలను నివృత్తి చేసిన నక్కా ఆనందబాబు, జూన్ 16న వేమూరులో నిర్వహించనున్న కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన విజయోత్సవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఓటరు ముఖ్యమనే భావనతో ప్రతి బూత్‌లో కూటమి సమన్వయంతో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు.

# "వేడుకలో ఆశీర్వాదం"



**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్ల పట్టణంలోని మున్నం వారి పాలెం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు ముదుగు సంజీవరెడ్డి, లక్ష్మీ పార్వతి దంపతుల కుమార్తెలు గీతాక్షిత రెడ్డి, కావ్యశ్రీ రెడ్డి ఓణీల బహుకరణ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బాపట్ల అసోసియేషన్ అధ్యక్షుడు పుట్టా ఆదిశేషా రెడ్డి, ఉపాధ్యక్షుడు చలికొండ వెంకట కృష్ణారావు, ట్రెజరర్ పువ్వాడ యల్లమంద, రాష్ట్ర అసోసియేషన్ గౌరవ సలహాదారు సుంకర శేషగిరిరావు, బాపట్ల జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బాలా శివారెడ్డి, సీనియర్ మాజీ సైనికులు రాయపూడి శ్రీనివాసరావు, పసుపులేటి ప్రసాద్, దూళ్ల వెంకటేశ్వర్లు, షేక్ ఖలీల్, ఉప్పిరెట్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.

# ప్రాణ రక్షణకు హెల్మెట్ కీలకం



**చందోలు రక్షణ న్యూస్**

రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా చందోలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ కె. మాధవరావు ఆధ్వర్యంలో గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ తలకు భారం కాదని, కుటుంబ భవిష్యత్తుకు రక్షణ కవచమని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని సూచించారు.రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. అలాగే యువత మాదక ద్రవ్యాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో అక్రమ కార్యకలాపాల బారిన పడవద్దని సూచించారు.సైబర్ నేరగాళ్లు వివిధ రూపాల్లో మోసాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలు, లింక్‌లను నమ్మి వ్యక్తిగత, బ్యాంకు వివరాలు పంచుకోవద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, యువకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.